## నేటి నుంచి సంక్రాంతి సెలవులు

**మళ్లీ 18వ తేదీన తెరుచుకోనున్న బడి తలుపులు**

హైదరాబాద్, జనవరి 10 : తెలంగాణలో సంక్రాంతి పండుగ హడావుడి మొదలైంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎందుకంటే రేపట్నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కాబట్టి. స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలలకు వెళ్లారు. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 18వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇక జూనియర్ కాలేజీలకు జనవరి 11 నుంచి 16 వరకు సెలవులు ప్రకటించారు.



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A:L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శనివారం 11-01-2025 సంపుటి : 06 సంచిక : 239 పేజీలు : 8 వెల : రూ 3-00


# నిర్మాణరంగాల్లో రాష్ట్రాన్ని నిలబెడతాం



**అందుకోసమే ఉచిత ఇసుక పాలసీ**
**రియల్ ఎస్టేట్ బాగున్న చోటే సంపద సృష్టి**
**గత ప్రభుత్వంలో నిర్మాణరంగం అడ్రస్ లేదు**
**గుంటూరులో నరెడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభించిన సీఎం**

గుంటూరు, :- 'బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకెళ్తున్నాం. ఐదేళ్ల విధ్వంస పాలనలో పడకేసిన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలన్న ధ్యేయంతో ఉన్నాం. అందుకే నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభ కార్యక్రమానికి వచ్చా. రాష్ట్రంలో నిర్మాణ రంగానికి మళ్లీ ఊపు రావాలని కోరుకుంటున్నాను. నిర్మాణం రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చేవారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కరిస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో ఏర్పాటు చేసిన నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం ప్రారంభించారు. అనంతరం బిల్డర్లను ఉద్దేశించి మాట్లాడారు.ఏడు నెలల క్రితం వరకూ నిర్వీర్యమైన రాష్ట్రాన్ని చూశాం. అన్ని వ్యవస్థలు పతనమయ్యాయి. నిర్మాణ రంగమైతే గత ఐదేళ్లు అడ్రస్ లేకుండా పోయింది. అందుకే ఎన్నికల్లో మమ్మల్ని ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చాం. ప్రజలు మమ్మల్ని నమ్మి 93 శాతం స్ట్రైక్ రేట్, 53 శాతం ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభించాం. గత ఐదేళ్లు ఎటు చూసినా అంధకారం విధ్వసమే కనబడింది. ఇప్పటికీ సమస్యలు ఉన్నాయి. మొన్ననే రాష్ట్ర చరిత్రలో లేని విధంగా ప్రధాని మోదీ రూ.2.8 లక్షల కోట్ల అభివృద్ధి పనులు, పెట్టుబడులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బ్రాండ్ ఏపీ ఇమేజ్‌తో ఇప్పుడిప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి.రాష్ట్రానికి పరిశ్రమలు రావాలి, వ్యవసాయం లాభసాటి కావాలి, పర్యాటకం ఊపందుకోవాలి, సంపద పెరగాలి.. అప్పుడే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలు నిర్మాణ రంగంపై ఆధారపడ్డాయి. గత ఐదేళ్లు ఇసుక లభించక భవన నిర్మాణ రంగం కార్మికులకు సరైన ఉపాధి ఉండేది కాదు. మా ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టాం. ఇసుక కొరత లేకుండా చేశాం. ఎవరైనా ఇసుక లభ్యం కాకపోతే.. గట్టిగా అడిగే హక్కు ఈ ప్రభుత్వం ఇచ్చింది. నరెడ్కో సంస్థ అంచలంచెలుగా ఎదిగింది. రియలెస్టేట్ రంగం వాటా జీడీపీలో 7.3 శాతం ఉంది. 2047కు 20 శాతం పెరిగి, 5.8 ట్రిలియన్ డ్రాలర్లు ఆర్జిస్తుంది. అన్ని రంగాలు అభివృద్ధి చేస్తే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. నాగరిక సమాజంలో నిర్మాణం అనేది నిత్యం జరుగుతూనే ఉంటుంది. అమరావతి అభివృద్ధి జరిగి ఉంటే ఈ ప్రాంతం మరింత నిలదొక్కుకుని ఉండేది. కానీ ఐదేళ్లు నిర్వీర్యం చేసి రాష్ట్రంలో నిర్మాణాన్ని నిలదొక్కకోకుండా చేశారు. కూల్చివేతలతో భయభ్రాంతులకు గురి చేయడంతో నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతింది. నిర్మాణ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇచ్చాం. నా జీవితంలో ఎప్పుడూ చూడని విధంగా భూ సమస్యలు వస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రికార్డులు తారుమారు చేసి భూకబ్జాలకు పాల్పడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ఇష్టానుసారంగా చేయాలని చూశారు. అందుకే అధికారంలోకి వచ్చాక రద్దు చేసి, యాంటీ ల్యాడ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చాం.

టీడీఆర్ బాండ్ల దోషుల్ని వదిలిపెట్టం'టీడీఆర్ బాండ్లలో డబ్బులు తీసుకుంది ఒకరు... నష్టపోయింది ఇంకొకరు. దీన్ని కూడా గత పాలకులు అక్రమాలకు వాడుకున్నారు. అవినీతికి పాల్పడ్డవారిని వదలిపెట్టం... అమాయకుల్ని కాపాడతాం. 7 నెలల్లో రాష్ట్రంలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి పనులు ప్రారంభిస్తున్నాం. తద్వారా 4 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అమరావతి పనులను రూ.50 వేల కోట్లతో ప్రారంభిస్తాం. ఇది స్వయం ఆధారిత ప్రాజెక్టు. రియల్ ఎస్టేట్ ఎక్కడ బాగుంటుందో అక్కడ సంపద సృష్టి జరుగుతుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కన్నా పెద్దగా అమరావతి చుట్టూ 183 కి.మీ మేర రింగ్ రోడ్డుకు ప్లాన్ సిద్ధం చేశాం. అది పూర్తయితే గుంటూరు-అమరావతి పట్టణాలు కలిసిపోతాయి. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాం. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చుతాం.ఐటీని అందిపుచ్చుకుని విదేశాలకు వెళ్లిన వారిలో గుంటూరు వాసులు ఎక్కువ.అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ఇతర దేశాల్లో మాదిరి రాష్ట్రంలోనూ స్వచ్ఛమైన వాతావరణాన్ని సృష్టిస్తాం. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను గతంలో గుంటూరులో ఏర్పాటు చేశాం. ఇక ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అభివృద్ధి, సుపరిపాలన ప్రభుత్వం చేస్తుంది. వాటిని మీరు ముందుకు తీసుకెళ్లాలి. నిర్మాణ రంగంలో మన రాష్ట్రాన్ని మించిన పాలసీ ఉండదు. వీలైనన్ని నిబంధనలు సరళతరం చేశాం. రాబోయే రెండు నెల్లలో డ్యాష్ బోర్డు తెస్తాం. మీరు తెచ్చిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తాం. నిర్ణీత సమయానికే అనుమతులు ఇస్తాం.ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకుంటాం. మీరు కూడా ఎక్కడా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడకుండా ఉండాలి. నిర్మాణరంగాన్ని నిలబెడుతున్నాం.గతాన్ని మర్చిపోండి. నిర్మాణ రంగంలోనూ నూతన ఆవిష్కరణలు వచ్చాయి. వాటిని ఉపయోగిం చుకుంటే రూ.500 సంపాదిం చేవాళ్లు రూ.1,500 సంపాదిం చవచ్చు. దేశంలో అమరావతి లాంటి కొత్తనగరం రాదు'దేశంలో అమరావతి లాంటి నగరం మరొకటి రాదు. కొత్త నగరాన్ని బెస్ట్ మోడల్ సిటీగా నిర్మిస్తాం. ఒక్క అమరావతినే కాదు విశాఖ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి లాంటి పట్టణాలను అభివృద్ధి చేస్తాం. భవిష్యత్తులో పట్టణాభివృద్ధి జరిగి మన నగరాలు కూడా అగ్రస్థానంలో ఉండాలి. అనధికారిక నిర్మాణాలు చేపట్టవద్దు. ఇసుకను ఉచితంగా ఇస్తాం. ఎక్కడా ఇసుక అక్రమ రవాణాను అనుమతించం. దీనిపై ఇప్పటికే కలెక్టర్ల, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చాం. అధికారులు తప్పు చేసినా క్షమించను.అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# 25 లక్షల నగదు.. కుటుంబంలో ఒకరికి జాబ్..

**తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలకు టీటీడీ పరిహారం**



తిరుపతిలో వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు టీటీడీ ప్రగాఢ సానుభూతి తెలిపింది.

తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. తిరుపతిలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని అన్నారు.తొక్కిసలాటలో మృతిచెందిన ఆరుగురి కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం అందజేయాలని టీటీడీ తీర్మానించిందని బీఆర్ నాయుడు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు భక్తులకు రూ 5 లక్షలు పరిహారం, స్వల్పంగా గాయపడ్డ 31 మంది భక్తులకు రూ 2 లక్షలు పరిహారం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఇప్పటికే చెక్కులు సిద్ధం చేశామని చెప్పారు. రేపు బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేస్తామని పేర్కొన్నారు. మృతుల కుటుంబసభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగమిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మృతుల కుటుంబాల్లోని పిల్లల విద్య ఖర్చులు టీటీడీనే భరిస్తుందని తెలిపారు.తొక్కిసలాట ఘటనపై ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు న్యాయ విచారణకు ఆదేశించారని బీఆర్ నాయుడు తెలిపారు. తప్పిదం ఎలా జరిగిందనే దానిపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. కావాలనే చేశారా అనే అంశంపై విచారణ చేయిస్తామని చెప్పారు. విచారణ త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఇలాంటి తొక్కిసలాట ఘటనలు మున్ముందు జరగకుండా చూస్తామని చెప్పారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించి తప్పు చేసిన ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# జగనన్న కాలనీల పేరు మార్చిన ప్రభుత్వం

అమరావతి, జనవరి 10: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది. గత జగన్ ప్రభుత్వ హయాంలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అయితే ఆ కాలనీల పేరు మారుస్తూ ఏపీ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఇకపై ఈ కాలనీలకు పీఎంఏవై - ఎన్టీఆర్ నగర్‌గా పేరు మారుస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.ఇక 2019 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో వైఎస్ జగన్ ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రాష్ట్రంలోని పలు పథకాలకు వైఎస్ జగన్ పేరు పెట్టుకొన్నారు. అలాగే పలు సంస్థలకు సైతం దశాబ్దాలుగా ఉన్న పేర్లను తొలగించి.. వాటికి సైతం వైఎస్ఆర్ పేరు పెట్టారు. దీనిపై విమర్శలు సైతం వెల్లువెత్తాయి. ఇక భూములు సర్వేతోపాటు పొలాల సర్వే చేసిన పాస్ పుస్తకాలపై సైతం సీఎం వైఎస్ జగన్ బొమ్మ ముద్రించుకొన్నారు.అలాగే పొలంలోని సరిహద్దు రాళ్లపై కూడా సీఎం వైఎస్ జగన్ బొమ్మలు ముద్రించారు. అసలే రాష్ట్ర విభజనతో.. ఆదాయం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. అలాంటి రాష్ట్రంలో ఇలాంటి అవనసరపు ఖర్చులు ఎందుకనే ఓ ప్రశ్న అయితే సర్వత్ర ఉత్పన్నమైంది. కానీ దుబారా ఖర్చు మాత్రం ఆగలేదు.

# భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 10-భూమి రికార్డులలో మ్యూటేషన్ల దిద్దుబాటు, రెవెన్యూ సదస్సుల్లో భూ పరిష్కార నిమిత్తం స్వీకరించిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల తాసిల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తో కలిసి భూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్ని మండలాల తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ భూమి రికార్డులలో మ్యూటేషన్ల దిద్దుబాటు కోసం పెండింగ్లో ఉన్న దరఖాస్తులతో పాటు రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను కూడా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆళ్లగడ్డ, బండి ఆత్మకూరు, పాములపాడు, నందికొట్కూర్, నంద్యాల అర్బన్, రూరల్ పాణ్యం, పగిద్యాల తదితర మండలాల్లో విఆర్ఓ, తాసిల్దార్, ఆర్డీఓ లాగిన్ లలో పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ ట్రాన్సాక్షన్ దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న రెవెన్యూ



సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు నమోదు చేయడంతో పాటు 45 రోజుల్లో రీసర్వే నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు.అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను కూడా పెండింగ్ లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్లో ఉన్న కోర్టు కేసులకు కౌంటర్ వేయడంతో పాటు కోర్టు మధ్యంతర, తుది ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు పరచాలన్నారు. పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో పైలెట్ ప్రాతిపదికన గ్రామాన్ని ఎంపిక చేసుకుని గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూమి సరిహద్దులు గుర్తించి రీసర్వే పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశిం చారు. గ్రామసభ నిర్వహించే రోజు గ్రామస్తులందరికీ తెలిసేలా ముందుగానే టామ్ టామ్ వేయించి విస్తృత ప్రచారం చేయాలన్నారు

# తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన

హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు.నల్లగొండ ? వరంగల్ ? ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి, కరీంనగర్ ? నిజామాబాద్ ? ఆదిలాబాద్ ? మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మల్కా కొమరయ్య, కరీంనగర్ ? నిజామాబాద్ ? ఆదిలాబాద్ ? మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజిరెడ్డిని ఎంపిక చేసినట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు.సరోత్తమ్ రెడ్డి వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి. ప్రధానోపాధ్యాయుడిగా 10 ఏండ్లు, స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా 21 ఏండ్లు పని చేశారు. 2012 నుంచి 2019 దాకా పీఆర్టీయూ జనరల్ సెక్రటరీగా సేవలందించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశారు సరోత్తమ్ రెడ్డి.పెద్దపల్లికి చెందిన మల్క కొమరయ్య.. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈ పట్టా పుచ్చుకున్నారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లో అనేక విద్యా సంస్థలను నెలకొల్పారు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చైర్మన్‌గా సేవలందిస్తున్నారుమెదక్ జిల్లాలోని రామచంద్రాపురానికి చెందిన సీ అంజిరెడ్డి బీఏ పూర్తి చేశారు. పారిశ్రామికవేత్తగా ఎదిగారు. అంజిరెడ్డి భార్య గోదావరి.. సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.



# సంపాదకీయం

శనివారం 11-01-2025

## మళ్లీ వచ్చిపడుతున్న మాయదారి వైరస్ లు

అదిగో పులి అంటే ఇదిగో తోక అనే ప్రపంచం. అందుకే ఇప్పుడు తుమ్మినా దగ్గినా భయం. రోగనిరోధక శక్తి తక్కువుంటేనో, సీజన్ మారితేనో.. చిన్నాచితకా అనారోగ్య సమస్యలు కామన్. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నాలుగురోజుల్లో అంతా నార్మల్. కానీ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన తర్వాత ఇప్పుడు కాస్త పడిశం పట్టినా, గొంతు గరగరమన్నా గుండెల్లో దడే. కడుపులో కాస్త మందంగా అనిపిస్తే ఒకప్పుడు ఓ పూట పత్యంచేస్తే సెట్టయ్యేది. కానీ ఇప్పుడు ఏ దిక్కుమాలిన వైరస్ శరీరంలోకి ప్రవేశించిందోనని అనుమానం హార్ట్‌బీట్ పెంచేస్తోంది. ఏం చేస్తాం మరి.. మళ్లీ వచ్చిపడుతున్నాయ్ మాయరోగాలు.చైనాకు రోగమొచ్చింది. ప్రపంచమంతా వణికిపోతోంది. కేసుల ఊసులేదు. ఊహాజనిత ప్రచారాలే తప్ప అధికారికంగా మరణాల సంఖ్య కూడా తెలీదు. చైనాలో మెడికల్ ఎమర్జెన్సీ డిక్లేర్ చేశారంటూ అనధికార వార్తలు. హెచ్ఎంపీ వైరస్ ..హ్యూమన్ మెటా న్యూమో వైరస్. కరోనాకి కజిన్‌లాంటిదే ఈ వైరస్ కూడా. కరోనా ప్రపంచాన్ని కుదిపేసింది. లక్షల ప్రాణాలను గాల్లో కలిపేసింది. మరి హెచ్ఎంపీవీ కూడా అంతే ప్రమాదమా అంటే అవునని చెప్పలేం. ప్రాణాంతకం కాదని కొట్టిపారేయలేం. ఎందుకంటే కరోనా సీజన్‌లో భయమే మనిషిని చంపేసింది. కరోనా వేరియంట్లలాగే హెచ్ఎంపీ వైరస్ టార్గెట్.. మన శరీరంలోని ఊపరితిత్తులే. అసలే కరోనా ప్రభావంతో లంగ్స్ వీకైపోయాయి. ఈ టైంలో కొత్త వైరస్ ఎఫెక్ట్‌పడితే ఏం జరుగుతోందనని భయం.ఓపక్క వైరస్‌ల పుట్టినింట్లో హెచ్ఎంపీ వైరస్ కల్లోలం సృష్టిస్తోందన్న ప్రచారం జరుగుతున్న సమయంలోనే.. అగ్రరాజ్యంలో నోరో వైరస్ వణికిస్తోంది. మరోవైపు పక్షులు, పశువులకే పరిమితమనుకునే బర్డ్‌ఫ్లూతో అమెరికాలో తొలిసారి ఒకరు మృత్యువాత పడ్డారు. అడవి పక్షులకు దగ్గరగా వెళ్లడంతో హెచ్5ఎన్1 సోకి ప్రాణాలు కోల్పోయాడు 65ఏళ్ల వ్యక్తి. వాస్తవానికి కరోనా తర్వాత ప్రపంచమంతా అంతగా చర్చ జరుగుతోంది హెచ్ఎంపీ వైరస్ గురించే. ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారినపడుతున్నట్లు కథనాలొస్తున్నాయి. శీతాకాలం అంటువ్యాధులు త్వరగా ప్రబలుతుంటాయి. జలుబు, జ్వరం, దగ్గు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఈ సీజన్‌లో సర్వసాధారణం. చాలామంది వీటికి ఏ టాబ్లెట్టో వేసుకుని ఉపశమనం పొందుతుంటారు. కానీ ఇప్పుడు కొంపదీసి కొత్త వైరస్సేమో అనే భయంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇమ్యూనిటీ సిస్టమ్ తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధులపై హెచ్ఎంపీ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పెద్దగా భయపడాల్సిన పన్లేదన్న మాట బలంగా వినిపిస్తున్నా.. కోవిడ్ 19కంటే తక్కువ ప్రమాదమేం కాదన్న వాదనకూడా వినిపిస్తోంది. ప్రస్తుతానికైనా ఈ వైరస్‌కి వ్యాక్సిన్ లేదు. అలాగని ఇదేం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన వైరస్ కాదు. హెచ్ఎంపీ వైరస్ ప్రచారంతోనే జనం ఉక్కిరిబిక్కిరవుతుంటే.. మరోవైపు నోరో వైరస్ విజృంభిస్తోందన్న వార్తలు మరింత భయపెడుతున్నాయి. అమెరికాలో నోరో వైరస్ రోజురోజుకీ తీవ్రమవుతోంది. యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ డేటా ప్రకారం ఆ దేశంలో నోరో వైరస్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. నవంబరు నుంచీ అగ్రరాజ్యంలో ఆ వైరస్ బాధితులు పెరుగుతున్నారు. నోరో వైరస్ జీర్ణకోశానికి సోకే వ్యాధి. బాధితులనుంచి నోరో వైరస్ ఇతరులకు వేగంగా సోకే అవకాశముంది. 12నుంచి 48 గంటల తర్వాత లక్షణాలు కనిపిస్తాయి. అతిసారం, వాంతులు, వికారం, కడుపు నొప్పి, జ్వరం, తలనొప్పి, బాడీ పెయిన్స్ ఉంటాయి. వైరస్ సోకిన రెండు రోజులపాటు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుముఖం పడుతుంది. నోరో వైరస్ కూడా కొత్తదేం కాదు. అమెరికాకి ఇప్పుడు సోకింది కాబట్టే ప్రపంచం ఉలిక్కిపడుతోందంతే. గతంలోనే తెలుగురాష్ట్రాల్లో ఈ వైరస్ లక్షణాలపై ప్రజలను ప్రభుత్వాలు అప్రమత్తం చేశాయి. ఆరునెలల క్రితమే హైదరాబాద్‌లో 100కు పైగా కేసులు నమోదయ్యాయి. పాతబస్తీలో తొందరగా వ్యాప్తిచెందిన నోరో వైరస్‌పై అప్పట్లో జీహెచ్ఎంసీ ప్రజలను అప్రమత్తంచేసింది. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల జాబితాలోనే నోరో వైరస్ కూడా ఉంది. పారిశుద్ధ్యం, కలుషిత ఆహారంతోనే ఈ వైరస్ వ్యాప్తిచెందుతుందని గుర్తించారు. ముఖ్యంగా ఈ వైరస్ మధ్య వయస్కులు, వృద్ధులు, గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికల్లో కిడ్నీ ఇన్ఫెక్షన్స్ కలిగిస్తుందని వైద్యులు చెబుతున్నారు. నోరో వైరస్ కంటే బర్డ్‌ఫ్లూనే ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ఓ పక్క ఈ మాయదారి రోగాలేంటని ప్రజలు తలపట్టుకుంటుంటే.. అటు మార్కెట్లు కూడా షేకవుతున్నాయి. చైనా తర్వాత భారత్‌ను తాకిన హెచ్ఎంపీవీపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలి సారిగా స్పందించింది. ఈ వైరస్ ను సాధారణ వైరస్‌గా చిఊూ అభివర్ణించింది. హెచ్ఎంపీ వైరస్ అంటే హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కొత్తది కాదని..దీనిని 2001లోనే గుర్తించామని సంస్థ తెలిపింది. ఇది చాలా కాలంగా ప్రజలలో ఉంది.. ఈ వైరస్ ప్రభావం శీతాకాలంలో పెరుగుతుందని పేర్కొంది.చైనాలో అనేక హెచ్ఎంపీ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఈ వైరస్ కేసులు భారతదేశంలో కూడా వెలుగులోకి రావడం మొదలయ్యాయి.

## ‘ఇండియా’ బ్లాక్ శాశ్వతం.. కేవలం ఎన్నికల్లో పోటీ కోసం కాదు: ఫరూక్ అబ్దుల్లా



శ్రీనగర్: ప్రతిపక్షాల కూటమి ‘ఇండియా’ బ్లాక్ శాశ్వతమని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. ‘ఇండియా’ బ్లాక్‌లో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం తలపడుతున్నాయి. ఈ కూటమికి చెందిన టీఎంసీ, శివసేన (యూబీటీ) వంటి పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ‘ఇండియా’ కూటమి ఐక్యత, మనుగడపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే అయితే ఈ కూటమిని ముగించవచ్చని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా గురువారం సూచించారు.కాగా, ఈ పరిణామాల నేపథ్యంలో ‘ఇండియా’ కూటమి భవిష్యత్తు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. ‘ఈ కూటమి శాశ్వతం. ఇది ప్రతి రోజు, ప్రతి క్షణానికి సంబంధించినది’ అని అన్నారు. అయితే ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో పోరాటం చేయదని తెలిపారు. జమ్ముకశ్మీర్ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## జనగామలో పోలీసుల ముమ్మర తనిఖీలు



జనగామ: జనగామ ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ ఆధ్వర్యంలో సంక్రాంతి, రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ లతో అర్బన్ పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, బతుకమ్మ కుంటతో పాటు జన సంచారం అధికంగా ఉండే ప్రధాన కూడళ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా అనుమానితుల కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో అర్బన్ సీఐ పీ దామోదర్ రెడ్డి, ఎస్సైలు రాజేశ్ కుమార్, భరత్, రాజన్ బాబు, ఏఎస్సై సాంబారెడ్డి, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం.. చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ

న్యూఢిల్లీ: ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా ‘ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ‘ అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది.దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. ‘ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు’ అని ఆయన వ్యాఖ్యానించారు.అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు

## శ్రీ గంగ భవాని దేవస్థానం కు నూతన కమిటీ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 10--నంద్యాల పట్టణం లో కుందూ నది ఒడ్డున వెలసిన శ్రీ గంగ భవాని ఆలయం కు శుక్రవారం నూతన కమిటీ ఏర్పాటు చేసారు. గౌరవ అధ్యక్షులుగా జి. భీష్మ,కమిటీ ప్రెసిడెంట్ నాగభూషణం.వై, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు. డి,లింగమూర్తి.ఎల్,(ట్రెసారార్) శ్రీను, సెక్రటరీ డి. మున్ని, జాయింట్ సెక్రటరీ ఎన్. హరిప్రసాద్, కమిటీ సభ్యులు సంజప్ప. ఎన్, సి. నరసింహులు, ఎన్. సుధాకర్, దుర్గ.డి. మరియు పూజారి జమ్మూలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మద్దిలేటి స్వామిని దర్శించుకున్న యువ నాయకులు మన్నే గౌతమ్ కుమార్ రెడ్డి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జనవరి 10 వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగుదేశం యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ కుమార్ రెడ్డి మరియు వారి కుటుంబ శ్రీ మద్దిలేటి స్వామి దేవస్థానం నందు స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సింగూరు ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంట ఆత్మహత్య

సంగారెడ్డి : సింగూరు ప్రాజెక్టు వద్ద విషాదం నెలకొంది. ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రేమికుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి వద్ద హరిత రెస్టారెంట్‌లో నిన్న మధ్యాహ్నం ఓ ఇద్దరు ప్రేమికులు ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. అయితే ఇవాళ మధ్యాహ్నం వరకు కూడా గది తెరవకపోవడంతో.. రెస్టారెంట్ సిబ్బంది అప్రమత్తమైంది. పోలీసుల సమక్షంలో ఆ గది తలుపులు తెరిచి చూడగా ప్రేమికులిద్దరూ ఉరేసుకున్న దృశ్యం కనిపించింది. పోలీసులు డెడ్‌బాడీలను కిందకు దించి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు మృతులను ఉదయ్‌కుమార్(21), మౌనిక(19)గా పోలీసులు నిర్ధారించారు. ఇరు కుటుంబాల పెద్దలు వీరి ప్రేమ పెళ్లికి అంగీకరించకపోవడంతోనే సూసైడ్ చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## ట్రంప్ నైపుణ్యం కలిగిన సంధానకర్త.. ప్రజల దృష్టిని మరల్చేందుకే అలాంటి వ్యాఖ్యలు : ట్రూడో



న్యూఢిల్లీ: అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చేయాలంటూ ట్రంప్ ఇటీవలే కీలక సూచన చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఇద్దరు దేశాధినేతల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. ట్రంప్ సూచనను ట్రూడో ఘాటుగా తిరస్కరించారు. యూఎస్‌లో కెనడా విలీనమయ్యే అవకాశమే లేదని ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. మరోసారి అదే విషయంపై ట్రూడో స్పష్టతనిచ్చారు. సుంకాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ట్రంప్ విలీనం వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.ఈ మేరకు ట్రంప్‌పై ట్రూడో కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ చాలా నైపుణ్యం కలిగిన సంధానకర్త అంటూ వ్యాఖ్యానించారు. అమెరికా ప్రజలు చమురు, సహజ వాయువు, విద్యుత్, స్టీల్, అల్యూమినియం, కలప, కాంక్రీట్ వంటివన్నీ కెనడా నుంచే కొనుగోలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. తమ దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తానని ఆయన అంటున్నారు. అలా చేసే ముందు ప్రజల దృష్టిని మరల్చేందుకే విలీనం వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. అమెరికాలో కెనడా విలీనం ఎప్పటికీ జరగదని తేల్చి చెప్పారు. తమ ప్రజలు కెనడియన్లుగానే ఉండేందుకు ఇష్టపడతారని స్పష్టం చేశారు. టారిఫ్‌లు విధిస్తే వాటి ధరలు అకస్మాత్తుగా పెరిగే అవకాశం ఉందని ట్రూడో పేర్కొన్నారు.2018 వాణిజ్య వివాదం సమయంలో అమెరికా వస్తువులను లక్ష్యంగా చేసుకొని కెనడా కౌంటర్ టారిఫ్‌లను ఉపయోగించడాన్ని ఈ సందర్భంగా ట్రూడో ప్రస్తావించారు. అయితే, ఈ సారి తాము అలా చేయకూడదని అనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఒకవేళ అలా చేస్తే కెనడియన్లకు ధరలను పెంచినట్లైతుందని.. వాణిజ్య సంబంధాలను కూడా దెబ్బతీస్తుందని ట్రూడో వివరించారు.అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ట్రంప్.. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే కెనడా, మెక్సికో, చైనా వస్తువులపై భారీ సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాలోకి అక్రమ వలసలు, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ నివారణకు ఇవి సహాయపడతాయని ఆయన చెప్పారు. మెక్సికో, కెనడాల నుంచి వచ్చే ప్రతి వస్తువుపై 25 శాతం సుంకం విధించే ఉత్తర్వులపై జనవరి 20 సంతకం చేస్తానని ట్రంప్ చెప్పారు. ఫెంటానిల్ స్మగ్లింగ్‌ను చైనా అరికట్టే వరకు ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై అదనంగా 10 శాతం సుంకం విధించాలనుకుంటున్నట్లు తెలిపారు.ఈ ప్రకటన తర్వాత ట్రంప్‌తో కెనడా ప్రధాని ట్రూడో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రూడోకు ట్రంప్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాలను సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేదంటే సుంకాలు పెంచుతామని హెచ్చరించారు. ఇందులో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని సూచించారు. ఈ క్రమంలో ‘గవర్నర్ ఆఫ్ కెనడా’ అంటూ ట్రూడోపై వ్యంగ్యస్త్రాలు సంధించారు.ఇక ఇంతలో కెనడా పధాని ట్రూడో రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ప్రకటన తర్వాత ట్రంప్ మరోసారి కెనడాను 51వ రాష్ట్రంగా చేయాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండటం కెనడాలో చాలా మంది ప్రజలకు ఇష్టమేనని వ్యాఖ్యానించారు. కెనడాకు అధికంగా రాయితీలు ఇచ్చి తమ దేశం ఎక్కువ కాలం నష్టపోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయం కెనడా ప్రధాని ట్రూడోకు తెలుసు కాబట్టే రాజీనామా చేశారని వ్యాఖ్యానించారు. అమెరికాలో విలీనమైతే దిగుమతి సుంకాలు ఉండవని, పన్నులు తగ్గుతాయన్నారు. అంతేకాకుండా రష్యా, చైనాలకు చెందిన నౌకల నుంచి ఎలాంటి ముప్పు ఉండదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ ప్రతిపాదనపై ట్రూడో ఘాటుగా స్పందించారు. అలా జరిగే సమస్యే లేదని తేల్చి చెప్పారు. ఇదే అంశంపై ఇప్పుడు మరోసారి క్లారిటీ ఇచ్చారు.

# ఆ పది మందికి మంత్రులకు డేంజర్ బెల్స్

విజయవాడ, జనవరి 10,ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అర్నెల్లలోనే కొందరు మంత్రులతో ప్రభుత్వానికి తలనొప్పులు తప్పడం లేదు. పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధుల వంటి విషయాల్లో ప్రభుత్వం సాధించిన విజయాల కంటే కొందరు మంత్రుల వ్యవహారాలకే జనంలో ఎక్కువ పబ్లిసిటీ లభించింది. ముఖ్యమంత్ర పదేపదే చెబుతున్నా వాటిని పట్టించుకోకుండా సాగిస్తున్న వ్యవహారాలతో చికాకులు తప్పడం లేదు.ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడం అంత సులువుగా ఏమి జరగలేదు. ఐదేళ్ల ప్రతి పక్షంలో సవాళ్లు, అవమానాలు, కష్టాలని అధిగమించి అధికారంలోకి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు 53 రోజుల పాటు జైలు జీవితాన్ని కూడా అనుభవించాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు ఆర్నెల్ల లోనే ఈ విషయాలు మర్చిపోయినట్టు వ్యవహరిస్తున్నారు.అవినీతి వ్యవహారాలకు దూరంగా ఉండాలని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని ముఖ్య మంత్రి పదేపదే చెబుతున్నా కొందరి తీరు మాత్రం మారడం లేదు. ఆర్నెల్లలోనే దాదాపు పది మందికి పైగా మంత్రుల పని తీరుపై తీవ్ర ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో వారి పేర్లపైనే ఎందుకు చర్చ జరుగుతోందనే వాదన కూడా లేకపోలేదు. ఇప్పటి వరకు ఆరోపణలు వచ్చిన వారంతా ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారే కావడం మరో రకమైన చర్చకు కారణం అవుతోంది.ఏపీ మంత్రుల్లో అందరి కంటే ముందు రవాణా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అందరికంటే ముందు వార్తల్లో నిలిచారు. మంత్రి భార్య ఎస్కార్ట్‌గా రాలేదని పోలీస్ అధికారిని దుర్భాషలాడటం చర్చనీయాంశం అయ్యింది. ఆ తర్వాత అదే బాటలో ఇతర మంత్రులు నడిచారు.ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో చాలామంది తొలిసారి మంత్రి పదవుల్ని దక్కించుకున్న వారే ఉన్నారు. సీనియర్లను కాదని జూనియర్లకు మంత్రి పదవులు ఇస్తే వారంతా సొంత వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మంత్రులంతా అదే ఫాలో అవుతున్నారు. ఏదొక వివాదాన్ని తలకు ఎత్తుకుంటున్నారు.రామ్ ప్రసాద్ రెడ్డి తర్వాత వాసం శెట్టి సుభాష్ వ్యవహార శైలిపై టీడీపీ అధినేత చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సీనియర్లను కాదని టీడీపీల వాసంశెట్టి సుభాష్‌కు అవకాశం కల్పించడంతో సొంత పార్టీ నేతలు ఆయనకు వ్యతిరేకంగా మారారు. ఆ తర్వాత మంత్రి పార్థ సారధి, హోంమంత్రి అనిత, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సివిల్ సప్లైస్ మంత్రి నాదెండ్ల, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇలా ఒకరి తర్వాత ఒకరు కూటమి పార్టీల్లో నేతలు వార్తల్లో నిలిచారు.అయా శాఖల్లో అవినీతి వ్యవహారాలపై పత్రికల్లో ప్రముఖంగా కథనాలు రావడమో, మంత్రులు సంబంధం లేని వ్యవహారాల్లో తల దూర్చి బొప్పి కట్టించుకోడమో జరిగాయి. కొన్ని శాఖల్లో మంత్రులు శృతి మించి సంపాదనపై పడ్డారనే ప్రచారం జరగడంతో ప్రభుత్వానికి ఆర్నెల్లలోనే బోలెడు అప్రతిష్టను మూటగట్టేలా చేసింది. పోస్టింగులు, ప్రమోషన్లలో కొందరు మంత్రులు గల్లాలు తెరవడం, ఆ విషయాలు బయటకు పొక్కడం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేలా చేసింది.అయితే మంత్రుల అవినీతి వ్యవహారాల్లో కొందరి పేర్లే ప్రముఖంగా బయట ప్రచారం జరగడం కూడా వ్యూహాత్మకమేనని భావన కూటమి పార్టీ నేతల్లో ఉంది. అయా పార్టీల్లో అంతర్గతంగా ఉన్న పరిస్థితులతో పాటు సమయం దాటిపోతే మళ్లీ అవకాశం వస్తుందో రాదోననే ఆందోళనతోనే మంత్రులు రెచ్చిపోతున్నారనే వాదన ఉంది.ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో తాము చేసిన పొరపాట్లు, తప్పుల్ని కవర్ చేయడానికి కులం, సామాజిక కార్డులను తెరపైకి తీసుకురావడం కూడా అయా పార్టీలకు కొత్త చిక్కులకు కారణమవుతోంది. తాము మాత్రమే తప్పు చేస్తున్నామా, మిగతా వారు శుద్ధపూసలా తరహా చర్చలతో ప్రధానంగా టీడీపీ ఇరకాటంలో పడుతోంది. కీలక శాఖలు, బాధ్యతలన్నీ కొందరి చేతుల్లో ఉంటే నిధులు లేని, ప్రాధాన్యత శాఖలపై ప్రచారం ఏమిటని వాదిస్తున్నారు. దీంతో అటు ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావంతో పాటు కూటమి పార్టీల తీరుపై ప్రజల్లో చర్చ జరుగుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

# తొక్కిసలాట వెనుక అనుమానాలు

తిరుపతి, జనవరి 10,తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మరణించిన ఘటన అందరినీ కలచి వేసింది. నిజంగా ఇది దురుదృష్టకరమే. కానీ ఇందులో గత ప్రభుత్వం నిర్వాకం కారణం కూడా ఉందన్నది వాస్తవం. గతంలో ఎన్నడూ లేని విధంగా 2019 నుంచి 2024 మధ్య కాలంలోనే తిరుమలలో ఈ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. గతంలో వైకుంఠ ఏకాదశికి ఒకరోజు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం ఉండేది. అదీ కాకుంటే మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ దర్శనాలు కొనసాగేవి. భక్తుల రద్దీని బట్టి వైకుంఠ ద్వార దర్శనాన్ని పొడిగించేవారు. కానీ గత ప్రభుత్వం దీనిని పూర్తిగా మార్చివేసింది. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల భక్తులకు సౌకర్యం కల్పించడం మాట దేముడెరుగు కానీ.. టీటీడీ ఆదాయాన్ని పొందడానికేనన్నది వాస్తవం. ఎంత మంది భక్తులు వస్తే అంత హుండీ నిండుతుందన్న కారణంతోనే అత్యాశతో గత ప్రభుత్వం ఈ ఆనవాయితీని తొలిసారిగా ప్రారంభించింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిని కంటిన్యూ చేసింది. దీంతో పాటు గత ప్రభుత్వం వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లను తిరుపతిలో ఇచ్చే ప్రక్రియను కూడా ప్రారంభించింది. అసలు తిరుమలలో శ్రీవెకంటేశ్వరస్వామి కొలువై ఉంటే తిరుపతిలో టిక్కెట్లను ఎందుకు విక్రయిస్తున్నారన్నది ఆ వెంకటేశ్వరస్వామికే ఎరుక. ఈ సంప్రదాయాన్ని కూడా ఈ పాలకమండలి కంటిన్యూ చేయడంతోనే ఈ ఘోర దుర్ఘటన తలెత్తింది. నిజానికి తిరుమలలో ఎన్ని గంటలైనా భక్తులు వేచి చూస్తూ క్యూ లైన్ లో శ్రీవారిని దర్శంచుకునే వారు. అక్కడ తొక్కిసలాట సమస్య ఉండదు. బ్రహ్మోత్సవాల సమయంలోనూ తిరుమలకు లక్షల సంఖ్యలో గరుడ వాహన సేవరోజు వచ్చినా ఇలాంటి దుర్ఘటన ఎన్నడూ జరగలేదు.కారణంగానే ఈ ఘటన జరిగిందని చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం అంగీకరించారు. కూడా అందరిలోనూ నెలకొంది. కావాలని ఈ దుర్ఘటనకు బాధ్యులు అయిన వారు పోలీసుల్లో ఉన్నారా? అన్న అనుమానం కూడా పాలకపక్షం నుంచి వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ఇదే రకమైన అనుమానాలను వ్యక్తం చేశారు. పోలీసులు పదకొండు వందల మంది అక్కడ ఉన్నప్పటికీ దుర్ఘటన జరిగిందంటే ఏదో బలమైన కారణం ఉండి ఉంటుందన్న వారి అనుమానాన్ని జ్యుడిషియల్ విచారణలోనే తేలనుంది. మొత్తం మీద తిరుపతి ఘటనపై జగన్ బ్యాచ్ చుట్టూ అనేక అనుమానాలు కలుగుతున్నాయి.అంటే పోలీసుల్లోనే జగన్ అంటే అభిమానం ఉన్న వారు ఈ పనికి పాల్పడ్డారా? అన్నది విచారణలో తేలనుంది. బుడమేరు విజయవాడను ముంచెత్తినప్పుడు కూడా ఇదే తరహా ఆరోపణలు వినిపించాయి. కృష్ణా బ్యారేజీ వద్ద బోట్లు అడ్డుకట్ట వేసి గేట్లు విరగేటట్లు కొందరు ప్రయత్నం చేశారని అప్పట్లో అధికార పార్టీ నేతలు ఆరోపించారు. ఆ బోటును అక్కడి నుంచి తొలగించడానికి పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. అలాగే గేటును పునర్నించేందుకు అష్టకష్లాలు పడాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా తిరుపతి ఘటనపై కూడా అలాంటి అనుమానాలు కలుగుతున్నాయని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. పోలీసులు కావాలనే తొక్కిసలాటకు కారణమయ్యారని ప్రత్యక్ష సాక్షులతోపాటు బాధితులు కూడా చెబుతున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

## టీడీపీకి తొక్కిసలాట బాధ

తిరుపతి, జనవరి 10, ప్రతి ఒక్కరి జీవితంలో కొన్ని మానని గాయాలు ఉంటాయి. మరపురాని సంఘటనలు ఉంటాయి. కానీ టిడిపి ప్రభుత్వహయాంలో గోదావరి పుష్కరాలతో పాటు తాజాగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఒక మాయని మచ్చ. 2015, జూలై 14న గోదావరి పుష్కరాల తొలి రోజున తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది గాయపడ్డారు. ఇందులో మహిళలతో పాటు చిన్నారులే అధికంగా ఉన్నారు. తాజాగా తిరుపతిలోజరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. అయితే ఇది అనుకోకుండా జరిగిన ప్రమాదాలే అయినా.. రెండు ఘటనలు టిడిపి ప్రభుత్వ హయాంలో జరగడం విశేషం.నాడు టిడిపి అధికారంలో ఉంది. మహా పుష్కరాల పేరుతో నెలల తరబడి అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే తొలి రోజు పుష్కర స్నానాన్ని ప్రారంభించాలనుకుని భావించారు సీఎం చంద్రబాబు. ఆయన పుష్కర స్నానం చేసిన కొద్దిసేపటికి తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. 52 మంది గాయపడ్డారు. చంద్రబాబు ప్రచార యావ కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అప్పట్లో దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ కు పుష్కర క్రతువును చిత్రీకరించే బాధ్యతను అప్పగించినట్లు ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలోనే పుష్కర ఘాట్లో తన కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు పుష్కర స్నానం ఆచరించారు. దాదాపు రెండు గంటలపాటు ఆయన ఘాట్లోనే ఉండిపోవడంతో జన రద్దీ పెరిగిందని.. దానికి కారణంగానే ఒక్కసారిగా తూపులాట జరిగిందన్నది విపక్షాల ఆరోపణ. నాడు చంద్రబాబుతో పాటు మంత్రుల కాన్వాయ్ లో 20 వాహనాలు ఘాట్లో గంటల ఉండిపోయాయని కూడా ఆరోపణలు వెల్లువెత్తుతాయి. అప్పట్లో చంద్రబాబు సర్కార్ రిటైర్డ్ జడ్జి సోమయాజులతో కూడిన ఏకసభ్య కమిషన్ ను వేసింది. అయితే నాటి పుష్కర వీడియోలు బయటకు రాకపోవడం విశేషం.తెలుగుదేశం కూటమి ప్రభుత్వంఉంది. ఈనెల 10 నుంచి తిరుమలలో ఉత్తర ద్వార దర్శనానికి టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీకి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది టీటీడీ. అయితే ఒక్కసారిగా ఇక్కడ తొక్కిసలాట జరగడంతో ఆరుగురు మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వంతో పాటు టీటీడీపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించింది. ఈ సాయంత్రానికి కొందరు అధికారులపై వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు తిరుమల చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.అయితే కేవలం టిడిపి ప్రభుత్వ హయాంలోఇటువంటి ఘటనలు జరగడం మాయని మచ్చగా నిలుస్తోంది. చంద్రబాబుకు పాలనాథుడిగా పేరు ఉంది. కార్యక్రమాల నిర్వహణలో లోపాలు వెలుగు చూస్తుండడం.. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతుండడం మైనస్ గా మారుతోంది. అయితే ఈ ఘటన తర్వాత కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెరిగింది. దీనిని టిడిపి కూటమి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. మొత్తానికి అయితే ఇటువంటి ఘటనలు ఏ ప్రభుత్వం ఉన్నా మాయని మచ్చగా నిలవడం ఖాయం. గతంలో గోదావరి పుష్కరాలు టిడిపి ప్రభుత్వానికి మైనస్ చేశాయి. తిరుపతిలో తొక్కిసలాట ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళన కూటమి పార్టీల్లో కనిపిస్తోంది.

## పార్టీలో నేతలు చెరో దారి

కాకినాడ, జనవరి 10,తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా పేరు పడింది. పార్టీ పుట్టినప్పటి నుంచి 1999, 2019 మినహా ప్రతి ఎన్నికలోనూ టిడిపినే ఇక్కడ గెలిచింది. పార్టీ కష్టాల్లో ఉన్న 2004,2009లో సైతం కొవ్వూరులో తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. అలాంటి చరిత్ర ఉన్న కొవ్వూరులో టీడీపీని చేజేతులా పార్టీ అధిష్టానమే నాశనం చేసుకుంటుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కారణం అక్కడ పార్టీలో పెరిగిపోయిన వర్గ పోరు.. కుమ్ములాటలు.కొవ్వూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరైనా అక్కడ శాసనం మాత్రం దొమ్మేరు దివాణందే. దొమ్మేరు జమీందార్లుగా పేరున్న పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు), ఆయన సోదరుడు అచ్చిబాబు చెప్పిన మాటే వేదంగా అక్కడ చెల్లుబాటు అయ్యేది. కృష్ణ బాబు ఐదుసార్లు కొవ్వూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొవ్వూరు ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. అప్పటి నుంచి టీవీ రామారావు, ఖా జవహర్, తానేటి వనిత (వైసీపీ), ముప్పిడి వెంకటేశ్వర రావు కొవ్వూరు నుంచి గెలిచారు. వీరి గెలుపు వెనుక ఉన్నది పెండ్యాల కుటుంబవే అన్నది బహిరంగ రహస్యం. దాదాపు 23 ఏళ్ళు ఓంగా పని చేసిన చరిత్ర ఉన్న కృష్ణ బాబు అనూహ్యంగా 2012లో వైసీపీలో చేరారు. దీంతో కంగారుపడిన టిడిపి శ్రేణులకు ఆయన సోదరుడు అచ్చిబాబు అండగా నిలబడ్డారు. ఆ తర్వాత ఎన్నికల్లో ఖా జవహర్ టీడీపీ నుంచి గెలిచి మంత్రి అయ్యారు. 2019లో జగన్ హవాలో తానేటి వనిత కొవ్వూరులో గెలిచి హోం మంత్రి అయ్యారు. ఆ గెలుపు వెనక ఉన్నది కృష్ణ బాబు అల్లుడు రాజీవ్ కృష్ణ అని ఆయన వర్గం ప్రచారం చేసుకుంది. ఆ టైంలో వైసిపిలో రాజీవ్ కృష్ణ ఒక వెలుగు వెలిగారు. అయితే 2024లో సీన్ మారింది. కూటమి ప్రభంజనంలో టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఇక్కడ నుంచి గెలిచారు. ఆ గెలుపునకు అచ్చిబాబు మద్దతు తోడ్పడింది. ఈ తరుణంలో కృష్ణబాబు మృతి చెందడం, ఆయన అల్లుడు రాజీవ్ కృష్ణ టిడిపి గూటికి చేరడం జరిగిపోయాయి. అయితే ఈ చేరిక తనకు తెలియకుండానే జరిగిందని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తనను కలిసిన కార్యకర్తలతో చెప్పినట్టు తెలుస్తోంది. అటు అచ్చిబాబు కూడా అధిష్టానం వైఖరితో అలకబూనారు. 2019-24 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నప్పుడు వారికి అండగా నిలబడింది స్థానిక తెలుగుదేశం నాయకులు. అయితే తమకు తెలియకుండా రాజీవ్ కృష్ణను అధిష్టానం పార్టీలో చేర్చుకోవడంపై వారు మనస్థాపం చెందినట్టు చెబుతున్నారు. ఎవరైతే తమని ఇబ్బందులు పెట్టారో వాళ్లకి పార్టీలో పెద్దపీట వేయడం ఏంటనేది వారి వాదన. మరోవైపు అన్ని సర్దుకుంటాయని పార్టీ హై కమాండ్ భావిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా కనిపించడం లేదు. మొదటి నుంచి మాజీ మంత్రి జవహర్‌ను కొవ్వూరు టీడీపీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. ఇప్పుడు రాజీవ్ కృష్ణ, జవహర్ ఏకం అయ్యారు అనేది వారి వెర్షన్. రాజీవ్ కృష్ణ, జవహర్ ఆశీస్సులతో సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీలు వెలియడాన్ని సాక్ష్యంగా చెబుతున్నారు. నిజానికి 2024లో కొవ్వూరు సీటు తనకే అని జవహర్ భావించారు. 2019 ఓటమి తర్వాత టిడిపిలో బలంగా వాయిస్ వినిపించిన వాళ్లలో ఆయన ఒకరు. కానీ గోపాలపురం నుంచి వచ్చిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు అధిష్టానం ఎమ్మెల్యే సీటు ఇవ్వడంతో జవహర్ సైలెంట్ అయ్యారు. అంతా చల్లబడింది అనుకున్న సమయంలో కొవ్వూరులో కొత్త గ్రూపులు బయలుదేరడం నియోజకవర్గంలో కుమ్ములాట్లకు కారణమైంది. వైసీపీని ఇబ్బందులు పెట్టాలనుకునే ప్రయత్నంలో ఆ పార్టీ నాయకులను ఆకర్షించి సొంత పార్టీలో కుమ్ములాట్లకు కారణం అవుతోంది అద్దిష్టానం అనేది కొవ్వూరు పరిస్థితులను గమనిస్తున్న వారి విశ్లేషణ. టిడిపి హై కమాండ్ మేల్కొని కొవ్వూరు గ్రూపు తగాదాలకు వెంటనే ఫుల్ స్టాప్ పెట్టకపోతే పార్టీ కంచుకోటగా ఉన్న కొవ్వూరు చేజారిపోయే ప్రమాదం లేకపోలేదు.

## అమర్నాథ్ ఏం సాధించాడో చెప్పాలి

విశాఖపట్నం,.తిరుమలలో తొక్కిసలా ట ఘటన దురదృష్టకరం అని రాష్ట్ర కో-ఆపరేటివ్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నా రు. విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైజాగ్ నుంచి తిరుపతి లో జరిగిన ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సాను భూతి తెలియజేస్తున్నామని చెప్పా రు.మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. మోదీ పర్యటన లో సుమారు 2 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకు స్థాపన చేశారు. ఈ పెట్టుబడులు మూడు నుంచి నాలుగు లక్షల ఉద్యోగాలు వస్తాయి అని అన్నారు.

## ఏడు నెలల కాలం...మౌనమేలేనోయి..

విజయవాడ, జనవరి10,నసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా మారారు. వైసీపీని అధికారం నుంచి దించి కూటమి ప్రభుత్వాన్ని ఏపీలో తేవడంలో ప్రముఖ పాత్ర పోషించారు. అయితే పదేళ్ల నుంచి ప్రశ్నించడానికే వచ్చానన్న పవన్ కల్యాణ్ కేవలం జగన్ ను మాత్రమే ప్రశ్నిస్తూ పాలనలో లోపం జరిగినా, ప్రభుత్వ వైఫల్యం జరిగినా ఆయన పట్టించుకోవడం లేదు. ప్రశ్నించడం పూర్తిగా మానేసినట్లుందని నెట్టింట విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం పవన్ కల్యాణ్ పొగడ్తలకే పరిమితమయ్యారంటున్నారు. ఏడు నెలల కాలంలో కనీసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపాన పోలేదన్న విమర్శలు ఆయన ఎదుర్కొంటున్నారు. పవన్ కల్యాణ్ అంటే సినీ హీరో గా అందరికీ అభిమానం ఉంటుంది ఆయన రాజకీయ రంగంలోనూ అలాగే వెలుగొందుతారని అభిమానులు నమ్మకం పెట్టుకున్నారు. అలాగే సొంత సామాజికవర్గమైన కాపులు కూడా ఎన్నికలకు ముందు పవన్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాయిస్ మాత్రం పూర్తిగా మ్యూట్ అయిపోయింది. ఏ ఘటన జరిగినా కనీసం ముందుగా స్పందించే పవన్ తన ప్రభుత్వంలో జరిగిన ఘటనలపై మాత్రం పెదవి విప్పకపోవడాన్ని విపక్షాలు సయితం ప్రశ్నిస్తున్నాయి. పార్టీ పదవుల విషయం సంగతి పూర్తిగా పక్కన పెట్టేశారని జనసేన నేతలే అంటున్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా తమకు అన్యాయం జరిగిందని నేతలు భావిస్తున్నారుఇదే సమయంలో తిరుపతి తొక్కిసలాట జరిగి గంటలు గడుస్తున్నా పవన్ కల్యాణ్ స్పందించకపోవడంపై నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. నీ ప్రశ్నలేమయ్యాయ్యా? అంటూ నిలదీస్తున్నారు. గేమ్ ఛేంజర్ ఈవెంట్ కు వచ్చి రోడ్డు ప్రమాదంలో అభిమానులు చనిపోతే గత వైసీపీ ప్రభుత్వం రోడ్లు వేయకపోవడమే కారణమని, అందుకే ప్రమాదం జరిగిందని అన్న పవన్ కల్యాణ్ తిరుపతి ఘటనపై ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలకు జనసేనాని వద్ద సమాధానం లేదు. ఆయన మౌనంగా ఉండటానికి కారణాలేంటని కూడా విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ లో పుష్ప సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో అందరినీ తప్పుపట్టిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడరని అడుగుతున్నారు. ఇక నిన్న విశాఖలో జరిగిన బహిరంగ సభలోనూ ప్రధాని మోదీని, ముఖ్యమంత్రి చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడానికే పవన్ కల్యాణ్ ఎక్కువ సమయం గడిపారని, అదే సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఊసు కూడా ఎత్తలేదంటూ కార్మిక సంఘాలు అంటున్నాయి. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు అప్పటి వైసీపీ ప్రభుత్వమే ప్రయివేటీకరణకు కారణమని పదే పదే విమర్శలు చేయడమే కాకుండా విశాఖకు వెళ్లి కార్మికుల ఆందోళనకు మద్దతిచ్చిన పవన్ కల్యాణ్ కు ప్రధానిని సభలో ఆ విషయం అడగకుండా ఎందుకు ఉన్నారని కార్మిక సంఘాలు నిలదీస్తున్నాయి. అందుకే అధికారం అనేది ఎవరి చేతుల్లో ఉన్నా చేతులు, నోళ్లు మూతబడిపోతాయని అనుకోవడానికి పవన్ కల్యాణ్ ఉదాహరణ అని కామెంట్స్ వినపడుతున్నాయి.

## అడ్డంగా బుక్కైన పేర్ని నాని

విజయవాడ, జనవరి 10, మాజీ మంత్రి పేర్ని నాని చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. రేషన్ బియ్యం పక్కదారిపై పోలీసులకు కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. మచిలీపట్నంలోపౌరసరఫరాల శాఖకు సంబంధించి గోదాములు దాదాపు 7వేల బస్తాల బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఆ గోదాములు పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉన్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పేర్ని నాని భార్యతో పాటు గోదాము మేనేజర్ మానస్ తేజ కు సైతం నోటీసులు జారీ చేశారు. అటు పేర్ని నాని భార్య పోలీస్ విచారణకు సైతం హాజరయ్యారు. ఇంకోవైపు నానికి సైతం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ తరుణంలో ఈ కేసులో కీలక ఆధారాలు పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా.. బియ్యం పక్కదారి పట్టించినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకోసం మినీ వ్యానులను వాడినట్లు తెలుస్తోంది.పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఇక్కడ గోదాములు ఉన్నాయి. వైసిపి హయాంలో పౌరసరఫరాల శాఖకు ఈ గోదాములను అద్దెకు ఇచ్చారు. రేషన్ బియ్యం ఈ గోదాముల్లో నిల్వ చేస్తుంటారు. వీటికి మేనేజర్ గా మానస తేజ్ ఉన్నారు. ఆయన నెలవారి జీతం 12 వేల రూపాయలు. అయితే ఒకేసారి మానస తేజ అకౌంట్ నుంచి పేరుని నాని ఎకౌంటుకు లక్ష 75 వేల రూపాయలు బదిలీ చేయడంపై అనుమానాలు ఉన్నాయి. తన యజమాని భర్తకు అంత మొత్తంలో మేనేజర్ పంపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మానస తేజ అకౌంట్లో సుమారు 25 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు కూడా గుర్తించారు. అందులో ఆయన వ్యక్తిగత అవసరాల కోసం ఏడు లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు కూడా పోలీస్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. తక్కువ జీతానికి పనిచేస్తున్న మానస తేజకు అంత మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు విచారణ చేపడుతున్నారు. పోలీసులకు కీలక ఆధారాలు లభించడంతో.. కోర్టు అనుమతితో ఒకరోజు కస్టడీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ బ్యాంకులో నగదు లావాదేవీల విషయంపై ప్రశ్నించినట్లు సమాచారం. మేనేజర్ మానస తేజతో పాటు డ్రైవర్ మంగారావు, మిల్లర్ ఆంజనేయులను పోలీసులు విచారించారు. అయితే మేనేజర్ పోలీస్ విచారణకు సహకరించలేదని తెలుస్తోంది. దీంతో నిందితులను మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మంత్రిగా ఉంటూ పేర్ని నాని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన చుట్టూ ఈ కేసు తిరుగుతోంది. అయితే నిందితులు పేర్ని నాని పేరు ఎక్కడ బయట పెట్టడం లేదు. రేషన్ బియ్యం తరలించడంలో మాజీమంత్రి నానికి సంబంధం లేదని.. తామే విక్రయించామని వారు పోలీసులకు చెబుతున్నారు. ఇంతటి భారీ మొత్తంలో బియ్యం తరలించడం అక్కడ పనిచేసే వారితో సాధ్యం కాదని.. కచ్చితంగా నాని హస్తం ఉందని అనుమానిస్తున్నారు. అందుకే ఆయన చుట్టూ ఉచ్చు బిగిస్తున్నారు. మొత్తానికైతే ఈ రేషన్ బియ్యం పంపిణీ వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నానిని అరెస్టు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## సింహాచలంలో ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

విశాఖపట్నం,వైకుంఠ ఏకాదశిని పురస్కరిం చుకొని విశాఖ సింహాచలం ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.దేవస్థానం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. పూలు, పండ్లతో ఆలయప్రాంగ ణాన్ని అందంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీని దృష్టిలో రేపు తెల్లవా రుజామున 4గంటలకు దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకు లు తెలిపారు.

## శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు..



విభారే న్యూస్ జనవరి 10 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రాతఃకాలంలో దేవాలయ ఉత్తర ద్వారమునకు పూజలు జరిపబడినవి.శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహమునకు షోడశోపచార పూజ జరపబడినది.అనంతరం శ్రీ సూర్యనారాయణ స్వామివారికివిశేష అభిషేకములు, జరిగినవి. భక్తులు అధిక సంఖ్యలో ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి శ్రీ స్వామి వార్ల దర్శనం, శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి తులసి దళార్చనలు చేసుకున్నారు.అనంతరం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సామూహిక భగవద్గీత పారాయణం చేయబడినది. కృత్తిక నక్షత్రం సందర్భంగా శ్రీషణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేష పూజలు జరిగినవి. శుక్రవారం సందర్భంగా శ్రీ మహా గౌరీ అమ్మవారి సన్నిధిలో రాహుకాల దీప దుర్గా పూజ, లలిత సహస్రనామ పారాయణం విశేషంగా జరిగినది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మాజీ మంత్రివర్యులు కేఈ ప్రభాకర్ తమ కుటుంబ సభ్యులతో విశేష పూజలు జరుపుకున్నారు. మరిమూ దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ దేవాలయ దర్శనం చేసుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినారు.ఈ వైకుంఠ ఏకాదశి కార్యక్రమమును ఆలయ ట్రస్ట్ సభ్యులు, మాతృ మండలి సభ్యులు సంయుక్తంగా జయప్రదం చేసినారు.

## 12 వ తేదీ ఆదివారం ప్లాటినం జూబ్లీ కార్యక్రమము పూర్వపు విద్యార్థులు జయప్రదం చేయాలి..




విభారే న్యూస్ జనవరి 10 ఎమ్మిగనూరు..1948 - 2024 ఈ కాలవ్యవధిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు చదివిన పూర్వపు విద్యార్థుల కలయి కను ప్లాటినం జూబ్లీ కార్యక్రమంతో ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క పూర్వపు విద్యార్థి పాల్గొని కార్యక్రమంలో జయప్రదం చేయవలెనని ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యులు షఫీ ఉల్లా, మాచాని వెంకటేశ్వర్లు, ఎం.సి. శివకుమార్, ఎన్. మల్లికార్జున, ఎం. హరి నారాయణరెడ్డి కమిటీ సభ్యులు పత్రికా ముఖంగా తెలియజేశారు.

## శనివారం శని త్రయోదశి సందర్భంగా శనైశ్చరునికి ప్రత్యేక పూజలు..



విభారే న్యూస్ జనవరి 10 కర్నూలు జిల్లా ప్రతినిధి..11/01/2025 అనగా శనివారం శని త్రయోదశి.. శనివారము త్రయోదశి తిథి కలిసి రావడం వలన దీనిని శని త్రయోదశి గా పరిగణింపబడుతుంది ఈ దినమున సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శని కి తైలాభిషేకం జరుగును, శనైశ్చరుడుకి హోమము జరుగును.తైలాభిషేకం చేసుకోవడం వలన ఉపయోగాలు ఏమిటి అనగా జాతకములో ఏలినాటి శని, అష్టమ శని అర్ధాష్టమ శని దోషాలు తొలగి మృత్యువు దరి చేరకుండా శనైశ్చరుడు మనల్ని అనుగ్రహిస్తారు.ఉదయం 7:00 గం"ల నుండి 10:30 ని"ల వరకు తైలాభిషేకములు జరుగును. 10:30 ని"ల నుండి హోమము జరుగును.తైలాభిషేకం-200/-సంకల్పం-116/-ప్రధాన హోమము-3500/-సంప్రదించ వలసిన నెంబర్సుబ్రహ్మణ్యం శర్మ 9000400431దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777..

## ఎం ఆర్ పి ఎస్ కర్నూలు సిటీ కన్వీనర్ గా మీసాల సుమలత



విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి. మోడీకి చంద్రబాబుకు రుణపడి ఉంటాం.భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఎస్సీ రిజర్వేషన్ కు కట్టుబడి ఉన్నందున రుణ పడి ఉంటానని ఎమ్మార్పీఎస్ కర్నూల్ సిటీ కన్వీనర్ మీసాల సుమలత తెలిపారు. ఈరోజు కర్నూ లు నగరంలోని ఎమ్మార్పీఎస్ మండల కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రాచపూడి ఆనంద్, కళామండలి రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి పోగు విజయ్ మాదిగ లు కలిసి ఎమ్మార్పీఎస్ కర్నూలు సిటీ కన్వీనర్ గా మీసాల సుమలత ఎన్నిక చేస్తూ ఎన్నిక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిటీ కన్వీనర్ మీ సా ల సుమలత మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితం అందెందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఏపీ సీఎం చంద్రబాబు ఎస్సీ రిజర్వేషన్ల కట్టుబడి ఉండటం సంతోషిస్తున్నామన్నరూ.ఎస్సీ రిజర్వేషన్ ఏబిసిడి వర్గీకరణ అమలు అనంతరం ఉద్యోగ అవకాశాలు చేపట్టడం మంచిదన్నారు. మాదిగలు కు ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు అందేలాగా అధికారులు చొరువ చూపాలని అని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కాషాపోగు సూరి, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్, కర్నూల్ మండల అధ్యక్షులు పాముల కుమార్, కర్నూలు మండల నాయకులు నాగేంద్ర ఆంజనేయులు రాముడు నాగన్న శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 10-నంద్యాల జిల్లా దాదాబ్రదర్స్ ఆధ్వర్యంలో ఘనంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు 25 కేజీల బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. గవర్నమెంట్ హాస్పిటల్ నందు గర్భిణీ మహిళలకు పేషెంట్లకు బ్రెడ్లు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. విజయ బ్లడ్ సెంటర్ నందు రక్తదాన శిబిరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాబ్రదర్స్ మాట్లాడుతూ మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి నిండు నూరేళ్లు, ఆయురారోగ్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సామాజిక సేవ, రాజకీయ రంగంలో గొప్ప వ్యక్తిగా, కులం మతం పార్టీ భేదాలులేకుండా శిల్పా సేవా సమితిని ప్రారంభించి, వివిధ రంగాలలో వేలాదిమంది నిరుద్యోగులకు, యువతకు ఉపాధి కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపారని తెలిపారు. రాజకీయంలో గెలుపు ఓటములకు




అతీతంగా శిల్పా సేవా సమితి ద్వారా నిరంతర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న గొప్ప నాయకుడు అని కొనియాడారు. యువత శిల్పా మోహన్ రెడ్డి అడుగుజాడల్లో నడవాలని భవిష్యత్తులో దాదాబ్రదర్స్ మరెన్నో సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష. మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నిసా. కౌన్సిలర్లు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

### ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా కార్యదర్శి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 10-నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నంద్యాల జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి ఎన్ రంగనాయుడు పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం నంద్యాలపట్టణంలోనిఇల్లు లేని నిరు పేదలతో కలసి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్షతన తో ధర్నా నిర్వహించారు . సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని నిర్మాణానికి హౌసింగ్ లోన్ 5 లక్షల రూపాయలు ఇవ్వాలని పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. నవంబర్ 18 వ తేదీన అన్ని మండల గ్రామాల సచివాలయంలో ఇల్లు లేని నిరు పేదలతో వ్యక్తిగత అర్జీలను ఇప్పించడం జరిగిందని అన్నారు . రెండవ విడత మండల తహసిల్దార్ కార్యాలయాల దగ్గర ఇల్లు లేని నిరుపేదలతో



ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. తరువాత జిల్లావ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర బాధితులతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల టౌన్ లో ఇల్లు లేని నిరుపేదలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసిల్దార్ రామ సంజీవయ్య అర్జీలను ఇప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు. సిపిఐ శాఖ కార్యదర్శి సహాయ కార్యదర్శులు ఎం హబీబ్ బేగ్. షేక్షావలి .సాల మద్దిలేటి. మద్దయ్య హుస్సేన్ సా .నారాయణమ్మ. చాంద్ భాష. కిట్టు. శ్రీనివాసులు. సిద్ధిక్.హుస్సేన్నా .మా భాష శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జనవరి 10 మున్సిపల్ కార్మికులు చేసిన గత 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసిన ఒప్పందాలకు జీవోలు విడుదల చేసి వాటిని వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆ యూనియన్ అధ్యక్షులు పెద్ద ఎల్లయ్య అధ్యక్షతన కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు కోశాధికారి బి.నాగమద్దయ్య పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం శెట్టి,జిల్లా ఉపాధ్యక్షులు రామమూర్తి,యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.వై.సుబ్బారాయుడు, జిల్లా నాయకులు అబ్దుల్ లతీఫ్,మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ హాజరై దీక్షలలో కూర్చున్న శ్రీరాములు,సురేష్,వాణిశ్రీ, రంగనాయకులమ్మ,వెంకటలక్ష్మి లకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభింప చేసి వారి పోరాటానికి అండగా ఉంటామని సంపూర్ణ మద్దతు ప్రకటించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడిచిందని సమ్మెకాలపు ఒప్పందాల జిఓలు జారీ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబునాయుడు గారిని,మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ పి.నారాయణ గారిని,ఉన్నతాధికారులను పలు పర్యాయాలు రాష్ట్ర కమిటీ కలిసి విన్న వించినా,రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించినా స్పందన లేదని పైగా ఫైనాన్స్ డిపార్ట్మెంట్కి వెళ్ళిన సిఫార్సుల ఫైళ్ళను టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే వెనక్కి తిప్పి పంపిందని,మరలా నేటికి ఈ ఫైల్స్‌ను పరిశీలించి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపలేదని.కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్ళకు పెంచడం లేదని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా 60 ఏళ్ళకే బలవంతంగా రిటైర్మెంట్ చేస్తున్నారని,వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వడంలేదని,మరణించిన కార్మికుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వడం లేదని,వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని,పీఎఫ్, ఈఎస్ఐ లలో ఉన్న తప్పొప్పులను సవరించి పకడ్బందీగా కానుక 1000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇంజనీరింగ్ కార్మికులు సుమారు 12'13 వేల మంది అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని ఇంటి కిరాయిలు,కరెంట్ చార్జీలు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని పెరుగుతున్న ధరలతో కుటుంబాలు పస్తులతో గడుపుతున్నారని గత సమ్మె సందర్భంగా 9 మంది అధికారులతో వేసిన కమిటీ నివేదిక తప్పుల తడకలతో ఉన్నదని,ఇంజనీరింగ్ కార్మికులకు జిఓ నెం.36 ప్రకారం జీతాలు చెల్లించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమ్మె కాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## శ్రీశైలం జలాశయంలోకి 21 లక్షల చేప పిల్లలు :ఎంపీ బైరెడ్డి శబరి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 10-నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సమక్షంలో శుక్రవారం పగిడ్యాల మండలం నెహ్రూ నగర్ గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శ్రీశైలం జలాశయంలో చేపపిల్లల సీడ్ ను వదలారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, "మత్స్యకారుల ఆర్థిక ప్రగతికి ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని . టీడీపీ నాయకత్వంలోని ఉమ్మడి ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి నూతన పథకాలు ప్రవేశపెడుతూ, వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు.ఉమ్మడి కర్నూలు జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ బియస్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, "ఈ కార్యక్రమం జలవనరుల సమర్థ వినియోగంతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడంలో దోహదపడుతుందన్నారు .కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ రాఘవ రెడ్డి , డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసర్ శ్యామల, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ సంధ్యారాణి, పగిడాల ఎంపీడీవో సుమిత్రమ్మ , నెహ్రూ నగర్ సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి , స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్లు ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 10-పశు పోషణ, వాటి అభివృద్ధికి గోకులం షెడ్లు ఎంతో ఉపయోగపడతాయని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో శుక్రవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గోకులం షెడ్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు గోకులం షెడ్లు ఎంతోఉపయోగంఅన్నారు.ప్రభుత్వం రైతులను ప్రోత్సహించి, పశుసంపద పెరిగేందుకు, పశువుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేసేందుకు సబ్సిడీ అందించి గోకులం షెడ్లు అర్హులకు మంజూరు చేస్తుందన్నారు. అర్హులు ప్రభుత్వ సబ్సిడీని సద్వినియోగం చేసుకొని గోకులం షెడ్ల ద్వారా పశువులను సంరక్షణ చేసుకోవాలని ఎంపీ శబరి కోరారు.

## ఘనంగా కోదండ రామాలయం లో ముక్కోటి ఏకాదశి వేడుకలు

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 10-నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయం లో వెంకటేశ్వర స్వామి ని సుగంధ ద్రవ్యాలతో విశేష అలంకరణ తో అలంకరించి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పలువురు వీఐపీలు భక్తులు భారిగా తరలి వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. ఎంతో పవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజు ధనుర్మాస పూజల్లో ఉత్తర ద్వార దర్శనం దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు భక్తులు అన్నారు . ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదం అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190